సాక్షి ప్రకాశం

ఆదివారం । 26 । మే । 2024



కమనీయం..కల్యాణం
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మద్దిపాడు మండలం మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది.
- 8లో..



అల్లర్లు జరగకుండా చూడాలి
ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామాల్లో అల్లర్లు జరగకుండా చూడాలని ఐసీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు సిబ్బందిని ఆదేశించారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
36.8/30.2

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల ప్రత్యేక అధికారుల నియామకం

ఒంగోలు టౌన్: ఎన్నికలకు సంబంధించిన విధుల నిర్వహణలో భాగంగా ముగ్గురు అధికారులను ప్రత్యేకంగా నియమిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. సీఐడీ అడిషనల్ ఎస్పీ పీవీ ఆర్ఎస్ఎస్ఎంవీఆర్ వర్మ, ఎస్పీ (ఎన్‌సీ) విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీ హైమావతి, సెబ్ అడిషనల్ ఎస్పీ కాకినాడ కె.శ్రీలక్ష్మిని ప్రకాశం జిల్లాకు కేటాయించారు. వెంటనే యూనిట్ ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ జవాబు పత్రాల మూల్యాంకనం ఆదివారం నుంచి తమ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, క్యాంపు నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. ఇంగ్లిషు, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, కామర్స్, గణితం, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సబ్జక్టుల జవాబు పత్రాలకు మూల్యాంకనం మొదలవుతుందన్నారు. పొదిలి, దర్శి, అద్దంకి, ఒంగోలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులంతా తప్పనిసరిగా తాము పనిచేసే కాలేజీలో రిలీవింగ్ తీసుకుని క్యాంపునకు హాజరుకావాలన్నారు. రిలీవింగ్ ఆధారంగా యూనివర్శిటీ వారు పంపిన జాబితా ప్రకారం పేపర్లు ఇస్తారని, ముందుగా వచ్చిన వాళ్లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

జిల్లాకు చేరిన 1473 సర్వీసు ఓట్లు

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో సర్వీసు ఓట్లకు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాకు సర్వీసు ఓట్లు రిజిస్టర్ పోస్టు ద్వారా 1473 ఓట్లు చేరాయి. శనివారం 40 సర్వీసు ఓట్లు పోస్టు ద్వారా చేరాయి. వచ్చిన ఓట్లను ఎన్నికల విభాగం అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపి ఎన్ని ఓట్లు వచ్చాయో లెక్కించి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ల్లో వేసి భద్రపరిచారు. మొత్తం 6693 సర్వీసు ఓట్లు ఉండగా ఇప్పటికి 1473 ఓట్లు జిల్లాకు చేరాయి. సర్వీసు ఓట్లను జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు భద్రపరుస్తారని అధికారులు తెలిపారు. దీనిలో వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.322

కొండపి (సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం ఈ సీజన్‌లోని అత్యధికంగా గరిష్ట ధర కేజీ రూ.322 పలికింది. కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.258.84 వచ్చింది. వేలంలో కట్టువారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 902 బేళ్లను వేలానికి తీసుకురాగా 845 బేళ్లు కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 57 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర వేలంలో 24 మంది వ్యాపారులు పాల్గొన్నారు. పొగాకు వేలానికి నాణ్యమైన బేళ్లను తీసుకురావాలని, అలాంటి బేళ్లకు వేలంలో అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. పొగాకు రైతులకు ఆయన సూచనలిచ్చారు.

చూడరా.. చూడరా..
మైమరిచి..

కనుచూపు మేర కనిపించే ఎన్నో ప్రకృతి సౌందర్యాలు. అపురూప వన్యప్రాణుల ఆవాసం నల్లమల అటవీ ప్రాంతం ఒక వైపు.. యుగాల చరిత్ర కలిగిన దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు మరో వైపు. మనస్సుకు ఉల్లాసాన్ని.. ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి సోయగాలు.. ఆధ్యాత్మిక సౌరభాలు.. వన్యప్రాణుల సందడితో పరవశించే పశ్చిమ ప్రకాశం సొంతం. ఈ వేసవిలో ప్రకృతి ప్రేమికులందరూ ఊరూరా ఎన్నికల కోలాహలంలో మునిగిపోయారు. కౌంటింగ్‌కు కొంచెం సమయం ఉండడంతో కాసింత ఉపశమనం కోసం విహారానికి సిద్ధమయ్యారు. అతి తక్కువ ఖర్చుతో విహారయాత్రను ఆస్వాదిద్దాం.. మైమరిచి.

- పశ్చిమాన ఆధ్యాత్మిక, పర్యాటక సిరి
- నల్లమల అందాలు.. ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలు
- యుగాల చరిత్ర కలిగిన చెన్నకేశవుడు
- ప్రకృతి సోయగాల నడుమ నెమలిగుండం రంగస్వామి
- ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడం కంభం చెరువు



నల్లమల అటవీ ప్రాంతం

సండే స్పెషల్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం.. అద్భుతం. చరిత్ర ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలకు నెలవు. చూడగా.. చూడగా మైమరిచే విహార ప్రదేశం. నాలుగు యుగాల చరిత్రకు సాక్షాత్కారంగా నిలిచే నాలుగు రాజప్రాకార గోపురాల మార్కాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీశైల మహా పుణ్యక్షేత్రానికి తూర్పు ద్వారంగా ఉన్న త్రిపురాంతకం పుణ్యక్షేత్రం, ప్రకృతి సోయగాల మధ్య కొలువైన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి, పులులకు, నెమళ్లకు, జింకలకు, దుప్పులకు, కొండచిలువలకు, చిరుతలకు, ఎలుగుబంట్లు, ఎన్నో వ్యాధులకు అవసరమైన వనమూలికల సంపద కలిగిన నల్లమల అటవీ ప్రాంతం పశ్చిమ ప్రకాశం ప్రత్యేకత.

శ్రీశైలానికి ముఖద్వారం

యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధి పెద్దదోర్నాల ప్రముఖ శివక్షేత్రం శ్రీశైలానికి ముఖద్వారంగా ఉంది. అటు విశాఖ నుంచి ఇటు తిరుపతి వరకు శ్రీశైలానికి వెళ్లే భక్తులు దోర్నాల మీదుగానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. పెద్ద దోర్నాల నుంచి శ్రీశైలం వరకు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే ప్రయాణం మరుపురాని మధురానుభూతిని నింపుతుంది. పర్యాటకుల కోసం అటవీశాఖ నల్లమల అటవీ ప్రాంతంలో దోర్నాల-శ్రీశైలం మధ్య జంగిల్ సఫారీ ఏర్పాటు చేసింది. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టాప్ లెస్ వాహనంలో ప్రకృతి అందాలను, వన్యప్రాణులను వీక్షించవచ్చు. జింకలు, దుప్పులు, ఎలుగుబంట్లు, అందమైన పక్షులు, ఆకాశాన్ని అంటే చెట్లు చూస్తూ అటవీ ప్రాంతమంతా తిరగవచ్చు. బిర బిర పారే కృష్ణమ్మ శ్రీశైలం మల్లన్న చెంత పరవళ్లు తొక్కుతుంది. వీరభద్రుని స్థావరాలు, భారీ ఆకృతిలో భైరవ విగ్రహాలు, ప్రాచీన దేవాలయాలు, నల్లమల అటవీ ప్రాంతంలో అనేకం ఉన్నాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరి ఆలయం చూసి తీరాల్సిందే. ప్రకృతి సిద్ధంగా ఉన్న సినిమా సెట్టింగ్‌లు ఎన్నో దర్శనమిస్తాయి. మార్కాపురం నుంచి శ్రీశైలానికి ప్రతి గంటకు ఆర్టీసీ బస్సులు ఉంటాయి. ఒంగోలు నుంచి 170 కిలోమీటర్ల దూరంలో మార్కాపురం నుంచి 90 కిలో మీటర్ల దురంలో శ్రీశైలం ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ డిపోల బస్సులు దోర్నాల–మార్కాపురం మీదుగా శ్రీశైలం వెళ్తాయి.



జంగిల్ సఫారీ ముఖద్వారం



కంభం చెరువు




మార్కాపురం చెన్నకేశవ స్వామి ఆలయం

దేవరాయల కాలం నాటి కంభం చెరువు

శ్రీ కృష్ణదేవరాయులు సతీమణి వరదరాజమ్మ నిర్మించిన కంభం చెరువు ఆసియాలోనే రెండో అతిపెద్ద చెరువుగా ఖ్యాతిగాంచింది. 2020వ సంవత్సరంలో ఐసీఐడీ సంస్థ నిర్వహించిన పోటీల్లో ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడంగా కంభం చెరువు ఎంపికైంది. ప్రపంచ వ్యాప్తంగా 14 కట్టడాలను గుర్తించగా వాటిలో కంభం చెరువుకు స్థానం దక్కడం విశేషం. అలాగే ప్రకృతి సోయగాల నడుమ జలజల ప్రవహించే గుండ్లకమ్మ పరవళ్లతో రాచర్ల మండలంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామివారి ఆలయం, ఆలయ పరిసరాల్లోని జలపాతం, కొండకోనలు ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తాయి. ప్రతి శనివారం ఆలయాన్ని తెరుస్తారు.


యుగాల చరిత్ర.. చెన్నకేశవుడి ఆలయం..

మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇటీవలే ఆలయాన్ని సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి చేశారు. నాలుగు యుగాల్లో స్వామివారి ఆలయం ఉన్నట్లు పురాణాల్లో పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయుల కాలంలో నిర్మించిన ఈ దేవాలయంలో 18 శాసనాలు ఉన్నాయి. అస్థాన మండపంలో స్తంభాలన్నీ ఏకశిలా నిర్మితాలే. అస్థాన మండపం చుట్టూ ఉండే చుంచు ఒకే రాతితో అనేక వంపులు తిరిగి ఉండటం విశేషం. ఆలయ మధ్య రంగంలో అన్నదమ్ములు ఒకరు చేసే పనిని మరొకరు చూడకుండా కేవలం శబ్ద గ్రహణశక్తితో రెండు స్తంభాలను ఒకే మాదిరిగా నిర్మించారు. దీంతో వీటిని అన్నదమ్ముల స్తంభాలుగా పేర్కొంటారు. ఆలయ శిల్పాలు నాటి కళాకారుల నైపుణ్యం కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి. డిసెంబర్ నెలలో సూర్యభగవానుని కిరణాలు స్వామి వారి పాదాలను తాకటం ఆలయం ప్రత్యేకత. ప్రస్తుతం ఆలయంలో 4 రాజగోపురాలను నిర్మిస్తున్నారు.



కీర్తి పొందిన చందవరం బౌద్ధక్షేత్రం

దక్షిణ భారతదేశంలో అతి పెద్ద బౌద్ధ స్థూపంగా చందవరం ప్రసిద్ధి చెందింది. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలో నిర్మితమైన ఈ క్షేత్రం త్రిపురాంతకేశ్వర క్షేత్రానికి అతి దగ్గరలో ఉంది. దొనకొండ మండలంలోని చందవరం–వెల్లంపల్లిల నడుమ గుండ్లకమ్మ నదిఒడ్డున విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో గల బౌద్ధ స్థూపం 150 అడుగుల ఎత్తైన కొండపై కొలువు తీరి 120 అడుగుల చుట్టుకొలత, 30 అడుగుల ఎత్తులో ఉంది. గౌతమ బుద్ధుడు, ధ్యానంలో నిమగ్నమై ఉన్న పాలరాతి శిల్పాలు, బౌద్ధరామాలు, విశ్రాంతి గదులు, బౌద్ధ సన్యాసుల ఆశ్రమ గదులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ బౌద్ధరామంలో ముఖ్య సంఘటనలు, ధర్మబోధనలను విశదపరిచే స్తంభాలు ఉన్నాయి. త్రిపురాంతకం నుంచి ఆటోలో వెళ్లవచ్చు.



నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం వ్యూ

శ్రీశైలానికి తూర్పు ద్వారం త్రిపురాంతకం..

శ్రీశైల పుణ్యక్షేత్రాల్లో అష్ట ద్వారాల్లో తూర్పుదిక్కున ఉన్న ద్వారమే ఈ త్రిపురాంతకేశ్వర స్వామి క్షేత్రం. శ్రీశైలం దేవస్థానం కంటే ముందుగానే ఈ దేవాలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ఆలయానికి నాలుగు దిక్కుల మహాద్వారాలు, వాటిపై ద్వార మండపాలు ఉన్నాయి. శ్రీ త్రిపురాంతకేశ్వర ఆలయాన్ని శ్రీచక్రంపై నిర్మించారు. ఆలయం బయట తూర్పు వైపు నుంచి లోనికి ప్రవేశించే మార్గం కుడివైపున ఒక రాతిపై స్వామి వారి పాద ముద్రలు ఉన్నాయి. ఇక్కడే ఇంద్రుడు పూజించినట్లు చెప్పే శివలింగం ఉంది. మార్కాపురం నుంచి 40 కిలో మీటర్ల దూరంలో, యర్రగొండపాలెం నుంచి 18 కిలో మీటర్ల దూరంలో ఉంది. మార్కాపురం నుంచి ప్రతి గంటకు బస్సులు ఉంటాయి. శుక్రవారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.



త్రిపురాంతకంలోని అమ్మవారి ఆలయం



నల్లమల అడవుల్లో రైలు మార్గం

కొండ..కోనల నడుమ రైలు ప్రయాణం

గుంటూరు నుంచి కర్నూలు, అనంతపురానికి వెళ్లేరైళ్లు గిద్దలూరు మీదుగా ప్రయాణం చేస్తాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని ఎత్తైన కొండలు.. దట్టమైన చెట్లు..కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతాల కనువిందు..మధ్య..మధ్యలో వంతెనలు, బొగద టన్నెల్‌లో సాగే ప్రయాణం అద్భుతంగా ఉంటుంది.



శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి సూచించారు. శనివారం స్పందన భవనంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సూపర్‌వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓట్ల లెక్కింపులో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. దీనిలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది



గోవింద నామాలు పలుకుతున్న భక్తులు



స్వామివారి కల్యాణం సందర్భంగా తాళిబొట్లు చూపుతున్న ఆగమ ప్రవర దివి వెంకటశేషాచార్యులుతో ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు

కమనీయం.. వెంకటేశ్వరస్వామి కల్యాణం

- గోవిందనామంతో మార్మోగిన మల్లవరం
- స్వామివారి కల్యాణానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదానం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మద్దిపాడు మండలంలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఆగమ ప్రవర దివి వెంకటశేషాచార్యులు కల్యాణం జరిపించారు. స్వామివారికి తలంబ్రాలను గుండ్లాపల్లి గ్రామానికి చెందిన పల్లకి సుబ్బరామిరెడ్డి, నాగమ్మ, మణికంఠ శ్రీనివాసరెడ్డి, తరుణాదిత్య నాగకృష్ణ సాయికుమార్‌రెడ్డి, భరణి కృష్ణమోహన్‌రెడ్డి తీసుకురాగా, స్వామివారి కల్యాణం ప్రారంభమైంది. స్వామివారి కల్యాణం సందర్భంగా వెంకటేశ్వరస్వామి కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పద్మావతి అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి కొలువుదీరగా కల్యాణకర్త వెంకటాచార్యులు వేద మంత్రాలు పఠిస్తూ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆ సమయంలో భక్తులు గోవిందనామాలు గట్టిగా పలకడంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ముందుగా ఘోర కవి సంపత్, గుండ్లాపల్లి కృష్ణయ్య బృందం తరంగ కాలక్షేపం నిర్వహించారు. భక్తులు తరంగ కాలక్షేపాన్ని ఆస్వాదిస్తూ ఆనందంలో మునిగితేలారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులు ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకోవడానికి క్యూకట్టారు. స్వామివారిని దర్శించుకుని వివిధ కుల సంఘాలు అన్నదాన సత్రాలలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి కల్యాణాన్ని సుమారు 20 వేల మందికిపైగా భక్తులు వీక్షించారు.



స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



స్వామివారిని దర్శించుకుని ఆశీసులు అందుకుంటున్న శిద్దా రాఘవరావు

కట్టుదిట్టమైన భద్రత కల్పించిన పోలీసులు...

ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మద్దిపాడు ఎస్‌ఐ వి.మహేష్ ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. వలంటీర్లు ఆలయంలోకి భక్తులను క్యూలో పంపుతూ ప్రతిఒక్కరికీ స్వామివారి దర్శనం కల్పించేలా పనిచేశారు. వెంకటేశ్వరస్వామి భక్త బృందం లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేసింది. స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు...

మల్లవరం వెంకటేశ్వరస్వామి కల్యాణం అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం వెంకటాచార్యులు రాజశేఖరాచార్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను ఆయనకు అందించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పెంటాల జ్యోతి శ్రీనివాసరావు, ఈఓ మీనిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో కన్నుల పండువగా కల్యాణం జరిగింది. మాగులూరి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి వారు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం...

శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవం అనంతరం శనివారం సాయంత్రం తెలగ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉప్పుగుండూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగారు. పూజారి దీవి శ్రీధర్‌బాబు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజారులు శ్రీనివాసరావు, రంగయ్య పంతులు, సిబ్బంది వేణు, సుబ్బారావు, దేవస్థాన కమిటీ సభ్యులు, వివేకానందస్వామి కమిటీ సభ్యులు కే శ్రీనివాసరావు, పీ శివాజీ, కే శంకరరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య హత్యకేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష

ఒంగోలు: భార్య శీలాన్ని శంకించి హత్య చేసిన కేసులో నిందితుడు కొర్రపాటి ఏడుకొండలుకు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శనివారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తాళ్లూరు మండలం కొర్రపాటి వారిపాలెంకు చెందిన కొర్రపాటి ఏడుకొండలు.. దర్శి మండలం వీరాయపాలెంకు చెందిన సనుమూరి అంజలిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. ఉపాధి నిమిత్తం వీరు స్థానిక మంగమూరు రోడ్డులోని సుందర్‌నగర్‌లో అద్దె ఇంట్లో జీవనం సాగించేవారు. అనేక సార్లు అంజలి శీలాన్ని శంకించి అనేక మార్లు నిందితుడు అంజలిపై గొడవపడేవాడు. ఈ క్రమంలో 2017 అక్టోబరు 23న రాత్రి 7గంటల సమయంలో మార్బుల్ రాయితో అంజలి తలమీద క్రూరంగా కొట్టగా బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే మరణించింది. దీనిపై అప్పటి తాలూకా సీఐ గంగా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచారు. ఒంగోలు కోర్టులో చార్జిషీట్ ఫైల్ దాఖలు చేయగా జిల్లా కోర్టులో విచారణ జరిగింది. నిందితునిపై నేరం రుజువు కావడంతో నిందితుడైన మృతురాలి భర్త కొర్రపాటి ఏడుకొండలుకు యావజ్జీవ జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.వసుంధర వాదించారు.

ప్రశాంతంగా రెండో రోజు ఇంటర్, పది పరీక్షలు

ఒంగోలు: ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 7430 మంది జనరల్ విద్యార్థులకుగాను 6924 మంది, 669 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 614 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 487 మంది జనరల్ విద్యార్థులకుగాను 410 మంది, 272 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 235 మంది హాజరయ్యారు. పరీక్షలు పూర్తి ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జరిగిన హిందీ పరీక్షకు 801 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. 22 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు కేవలం 231 మంది మాత్రమే హాజరయ్యారు. 570 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో డి.సుభద్ర తెలిపారు.

తీర ప్రాంతాల్లో గాలివాన



కరవదిలో మబ్బులు పట్టిన ఆకాశం

ఒంగోలు రూరల్: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి గాలితో కూడిన వర్షం కురిసింది. సమీపంలో ఉన్న బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా, అనంతరం తుఫాన్‌గా మారిన నేపథ్యంలో వాతావరణంలో కూడా వేగంగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై సన్నపాటి జల్లులతో మొదలై సాయంత్రానికి వర్షం కురిసింది. వాతావరణశాఖ సూచనల మేరకు రెవెన్యూ, మత్స్యశాఖ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వారి సూచనల మేరకు మత్స్యకారులు పడవలను తీరం నుంచి కాస్త దూరంగా తరలించారు. గుండాయపాలెం వద్ద అలల ఎత్తు పెరిగడంతో సముద్రంలోకి ఎవరూ వెళ్లవద్దని తెలిపారు. పలు రేవుల్లో 5వ నంబర్ ప్రమాద హెచ్చరికలు ఎగరవేసిన నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలోని పడవలు, బోట్లు, ఇంజిన్ బోట్లు, వలలు జెట్టి వద్దకు చేరుస్తున్నారు.



గుండాయపాలెంలో ఒడ్డుకు చేర్చిన పడవలు

అల్లర్లు జరగకుండా చూడాలి

- డివిజన్ స్థాయి ఎన్నికల సమీక్ష సమావేశంలో ఐజీ త్రిపాఠి

దర్శి: ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామాల్లో అల్లర్లు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని జిల్లా పోలీస్ అధికారులను ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి ఆదేశించారు. దర్శి డీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన డివిజన్ స్థాయి ఎన్నికల సమీక్ష సమావేశానికి ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి ఐజీ హాజరయ్యారు. ఎన్నికల పోలింగ్ రోజు జరిగిన విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కౌంటింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాల్సిన గ్రామాలపై సమీక్షించారు. దర్శి నియోజకవర్గంలో జరిగిన అల్లర్లు, వాటిపై నమోదైన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలు, అక్కడి తాజా పరిస్థితులు, పలు కేసుల గురించి వాకబు చేశారు. తరచూ గ్రామాల్లో పర్యటించి ఎలాంటి కేసులు ఉత్పన్నం కాకుండా, ప్రశాంతత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు సెక్షన్ 144 పీఆర్సీ అమలు చేయాలని, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుమతి లేదని అన్నారు. గ్రామాల్లో ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెడు నడత కలిగిన వారిని బైండోవర్ చేయాలని, వారిపై నిఘా ఉంచి కౌన్సిలింగ్‌లు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఆ తర్వాత కూడా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఐజీ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐలు సమీఉల్లా, మల్లికార్జున రావు, సుబ్బారావు, డివిజన్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పక్కన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్


విలేకరులు అడిగిన ప్రశ్నకు నీళ్లు నమిలిన ఐజీ, ఎస్పీలు...

ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన మహిళా పోలీస్ కట్టా అనూషపై ఎన్నికల రోజు టీడీపీ మూకలు దాడి చేయడం, దానిపై పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు కట్టకపైగా, టీడీపీ నేతలను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి రాజీ చేసుకోవాలంటూ మహిళా పోలీస్‌పై ఒత్తిడి చేయడం, అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో కేసు కట్టకుండా ఆమె ఇచ్చిన ఫిర్యాదు వెనక్కు ఇచ్చి పంపడంపై ఐజీని విలేకరులు ప్రశ్నించారు. దానికి ఎస్పీ, డీఎస్పీ స్పందిస్తూ కేసు కట్టామని బదులిచ్చారు. ఆ మహిళా పోలీస్ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించగా, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాత్రమే కేసు కట్టారని, ముందుగా కేసు కట్టకుండా రాజీ చేయాలని టీడీపీ నేతలను కూర్చోబెట్టి ఆమెపై ఎందుకు ఒత్తిడి తెచ్చారని, రాజీ చేసుకోలేదని ఆమె ఫిర్యాదును వెనక్కు ఎందుకు ఇచ్చారని విలేకరుల ప్రశ్నించారు. దానికి ఐజీ త్రిపాఠి స్పందిస్తూ వెనుక వైపున్న ఎస్పీ వంక వేలు చూపిస్తూ.. వారు చెప్తారంటూ సమాధానం దాటవేశారు. ఐజీతో పాటు ఎస్పీ కూడా నీళ్లు నములుతూ వారి వాహనాలు ఎక్కి సమాధానం చెప్పకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్థానిక పోలీసు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తినంత పనైంది.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చందలూరు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది



త్రోబాల్ కు ఎంపికైన విద్యార్థి బ్రెట్లీ

దర్శి: ఈనెల 22వ తేదీ నిర్వహించిన జాతీయస్థాయి త్రోబాల్ టీం సెలక్షన్స్‌లో మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎర్రగుంట్ల బ్రెట్లీ ఎంపికయ్యాడు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో పంజాబ్ లోని పటియాలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆడుతున్నట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సోము అంజిరెడ్డి తెలిపారు. విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ గురుప్రసాద్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

ఘర్షణలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ

చీరాల రూరల్: ఎన్నికల కౌంటింగ్ రోజు అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి రౌడీషీట్లు తెరవడమే కాకుండా నగర బహిష్కరణలు కూడా చేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠి త్రిపాఠి హెచ్చరించారు. శనివారం చీరాల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఐజీ సందర్శించారు. నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల తదనంతర పరిణామాలు, ఘర్షణలపై నమోదు చేసిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న భద్రతా చర్యలపై సమీక్షించారు.